



# చెరువు

నాగరాజు గంధం

ఎండ వేడెక్కుతోంది. గాలి ఆగాగి వేడిగా కళ తప్పి వీస్తోంది- అసహనంగా గడుస్తోంది కాలం రావిచెట్టు కింది, ఎద్దరుగు మీదున్న పంచాయతీకి...

"అడిగో ఒస్తన్నాడు నరిసిరెడ్డి," గుసగుసలాడుకున్నారు జనం. అప్పటికి మూడు గంటలయింది- నరిసిరెడ్డికి పంచాయతీ కబురెళ్లి.

నెమ్మదిగా తలెత్తి చూశాడు చిన్నారెడ్డి.

నరిసిరెడ్డి ఒక్కడే రావడం లేదు. నీరకట్టి- గరటాలుతో కలిసొస్తున్నాడు.

చిన్నారెడ్డి భ్రుకుటి ముడిపడింది కోపంతో- అయినా తమాయించుకున్నాడు.

"ఏంది మావ పెళ్లికనుకున్నావా ఏంది పిలిచింది? పంచాయతీకి- ఎంతసేపుటి నుంచో తెలుసా మేమీడ కూకుంది?" అన్నాడు సైదారెడ్డి ముఖాన నవ్వు పులుముకుంటూ.

నరిసిరెడ్డి నవ్వలేదు. ముభావంగా చిన్నారెడ్డి ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. ఎండన పడి రావడంతో అతని ఒళ్లంతా ధారాపాతంగా ఉంది- వయసు మీదపడ్డ మనిషి కావడంతో స్వల్పంగా ఒణుకుతున్నాడు. పై కండువాతో ముఖం తుడుచుకుని, "ఏంది రమ్మన్నావంట?" అడిగాడు నరిసిరెడ్డి.

ఒక్కక్షణం మాట్లాడలేదు చిన్నారెడ్డి- "పంచాయతీ పిలుపిది," అన్నాడు క్లుప్తంగా.

"పంచాయితీ పిలుపో నీ పిలుపో నాకు తెలుసు ఇసయం ఏందో సెప్పు."

"ఇయ్యన్నీ తెలిసినోడికి ఇసయం మాత్రం తెలియదా?" అన్నాడు రాయప్ప.

రాయప్పవైపు చురుగ్గా చూశాడు నరిసిరెడ్డి. "ఇసయం తెల్సు- అసలు ఇసయమే తెలీదు," అన్నాడు పెడసరంగా.

"ఏహె నువ్వూరుకుండరా!" అని రాయప్పని మందలించి, "కుర్రనాయాలు మాటలకేముందిలే మామ! నువ్వీడ కూకో ముందు," అన్నాడు సైదారెడ్డి.

"అవుసరంలా- ఇసయమేందో సెప్పండి," అన్నాడు నరిసిరెడ్డి.

ఒకసారి నరిసిరెడ్డిని తేరిపార చూసి అడిగాడు చిన్నారెడ్డి. "సెరువుగట్టు తెంచుతా ఉంటే అడ్డం పడినావంటగా?"

"అవును- అది పల్లం వైపునున్న గట్టు- సెరువులో ఉండేదే కొద్దినీరు. గట్టు కొడితే ఆ కాత్త నీరు జారిపోద్ది- అందుకే ఆపాను."

"గట్టు కొట్టడం పంచాయతీ తీరమానం," అన్నాడు చిన్నారెడ్డి.

"ఎవుడ్నడిగి సేసారు?"

"పంచాయితీకి పెతోడి ఒప్పుదల అవసరం లేదు," తీవ్రంగా అన్నాడు చిన్నారెడ్డి.

"కానీ ఊళ్లో పెతోడికి సెరువు అవసరం- అది ఊరుకి ఉమ్మడి ఆస్తి- నువ్వొక్కడివే పంచాయతీ పేరున గట్టు తెగేసి సెరువు ఎండబెడ్తానంటే ఎవరూ ఒప్పుకోరు," అంతకన్నా తీవ్రంగా అన్నాడు నరిసిరెడ్డి.

చిన్నారెడ్డి ముఖం కోపంతో జేవురించింది.

"ఏంది... ఇవరం వేరుండగా మాట్లాడతావు? నేనేం ఎండిన సెరువులో గుడిసేసుకుని తొంగుంటానికి గట్టు కొట్టమన్నానా? ఊళ్లో హరిజనులు ఇళ్లేసుకుంటానికి స్తలం సూపించమని కలట్టరు కాడి నుండి తాకీదు- సరే ఎట్టయినా సెరువు వాడకంలో లేదుగా- అజ్ఞాపిస్తే

ఆళ్లే సరిజేసుకుంటారు. నెలాకరుకల్లా పట్టా తెప్పించ వచ్చులే అని సెరువుగట్టు కొట్టమన్నానేగాని... నేనేం బావుకుందామని గాదు,'' అన్నాడు.

నరిసిరెడ్డి కొద్ది క్షణాలు మౌనంగా చిన్నారెడ్డి వంక చూసి అడిగాడు-

“అందుగ్గాను నీకు సెరువు ఎండగట్టి ఇయ్యడం తప్పితే మరోదారి తొయ్యలా?''

అంతవరకూ కల్పించుకోకుండా ఆగిన సైదారెడ్డి నెమ్మదిగా అన్నాడు- “మరో దారంటే ఏంది మావ? అయినా సెరువు మాత్రం ఇప్పుడేవుందని? వాడకం లేదుగా- సెరువు సెరువులాగుందా ఇప్పుడు?''

అతని మాట పూర్తికాకుండానే అన్నాడు నరిసిరెడ్డి-

“ఎందుకు సెరువు సెరువుగాకుండా పోయిం దిరా? దానికదే అట్టగయిందా? మనం జేత్తే అయింది- సెరువు గట్టునున్న సెట్లన్నీ పాటలెట్టి అడితికి తోలినం గనుక, సెరువు సెరువు గాకుండాపోయింది. ఎవుడిష్టం ఒచ్చినట్టు ఆడు మట్టి తవ్వుకుని- ఇటుక బట్టీల కమ్ము కున్నం గనుక సెరువు గాకుండాపోయింది. ఇదిగో ఇట్టా గట్టు తెగ్గొట్టి ఎండగట్టి ఇళ్లేసుకుంటున్నం గనుక సెరువు సెరువు గాకుండాపోయింది. ఇన్నాళ్లబట్టీ మీరు ఏం చేసినా పంచాయతీకి ఎదురెల్లడం అంత ఒప్పుగాదని ఊరుకున్నా... ఇయ్యాలసలు సెరువే పూడుత్తామంటే నేనొప్పుకోను.''

“అసలేందెహె- మతిలేకుండగా మాట్టాడతావు- కెనాలొచ్చినాక ఇంకేంటికి సెరువు?'' అన్నాడు రాయప్ప విసుగ్గా -

ఆ మాటకి ఛర్రున రాయప్పవైపు తిరిగాడు నరిసి రెడ్డి- “అట్టనారా? కెనాలొచ్చాక నీ కంటికి సెరువు ఆనట్లే దేరా? అవున్లే పెళ్లాం రాగానే అమ్మని బయటికి తోసిన్నా యాలివి నీకు కెనాలు ముందు సెరువేడ అగపడద్ది? ఓరయ్య! మీ అయ్య ఇరవై ఎకరాల సెక్క ఆ సెరువు పున్నాన కూడబెట్టిందే- ఆడుండబట్టే నువ్వియ్యాల పంచాయతీ పెద్దవయ్యావ్,'' అన్నాడు వ్యంగ్యంగా.

ఆ మాటకి రాయప్ప ముఖం మాడిపోయింది.

పరిస్థితి మారిపోతోందని గ్రహించి మధ్యలోనే కలుగజేసుకున్నాడు సైదారెడ్డి- “నీకు తెలియంది కాదు మావ! ఇప్పుడు సెరువు ఊరికి ఏ రకంగానూ ఉప యోగం కాదు- సెరువుకు మునుపటి వెలుగు తేటం అంత తేలికపాటి పనికాదు- మరింగ సెరువు పూడ్పిం చడం తప్పితే ఏంచేస్తాం?''

“ఏందిరా సైదా? ఇవరం సవరం లేకుండా మాట్లాడతావ్? అసలు నోరెట్టా ఆడుతోందిరా మీకు సెరువు పూడవమంటానికి? - సెరువు ఎంతసేసింది మనకు?

“వానసుక్క రాలని కాలాల్లో ఈ సుట్టుపక్కల ఇరవై ఊళ్ల జనానికి తాగునీరు మన సెరువే- మీరెరగరు గానీ కెనాలు రాకమునుపు మన యవసాయం సెరువు మీద ఎంత ఆధారపడి ఉండేదిరా? ఊళ్లో సెరువు నీటి కోసం తగాదాలు రాకూడదని... ఈ సిన్నారెడ్డి తాత పెద పిచ్చిరెడ్డి, మా నాయన కల్సి- యాడో ‘చిత్తూరు అమ్మి నాయుడి' జమీ నుండి పధ్నాలుగేండ్ల గరటాలు గాన్ని దెచ్చి సెరువుమీన ‘నీరకట్టి'గా పెట్టినారు- పచ్చపాతం లేకుండా రైతులకి నీళ్లొదలడం కాడి నుండి సెరువు అజామయిసీ అంతా ఆడే సూసిండు. మరి ఆడి కుటుంబం ఈడే సెరువున్నమ్ముకుని ఉండిపోయే- సిన్నారెడ్డి నాయన హయాన పూడికలు తీయించడానికి- వడ్డెరోళ్లని కొందర్ని, కుమ్మరోళ్లని కొందర్ని తెచ్చి ఊళ్లో బెట్టిండు. అంతకు మునుపు మనూళ్లో ఆ కుటుంబాలే లెవ్వు- ఆళ్లు ఒచ్చింద్రు. సెరువున్నమ్ముకుని ఊళ్లోనే ఉండిపోయారు. ఈ ఇందరు రాబట్టేగదా ఊరు కాస్త కళన పడ్డది. మీరు సెరువుని నాశనం చేస్తా ఉన్నారు. ఈళ్ల జీవితాలు కళతప్పతా ఉన్నాయ్. మరిప్పుడు ఏకం గా సెరువే పూడుత్తామంటే... ఈళ్లందరూ ఏడకిరా పోవాలి?''

సైదారెడ్డి మాట్లాడలేదు. అంతవరకూ అందరి మాటలూ వింటు్ను మునసబు తాతరెడ్డి, “అబ్బాయా!... నరిసిరెడ్డి చెప్పింది శానామటుకు సబబే, సెరువుండడం వల్ల ఏనాటికైనా లాబమేగానీ నష్టంలేదు. అంతగా సోటు గావాలంటే ఎగువమెట్ట బంజరుగా పడుంది. దాన్ని సూపించండి.'' అన్నాడు చిన్నారెడ్డితో -

“ఎగువమెట్టా? అదెట్టా ఈలవుద్ది కక్కా- అది దేవుడి భూమి,'' అన్నాడు చిన్నారెడ్డి.

“అయితే ఏంది?... అదీ ఉమ్మడిమీదా నడిసే దేగా, పైగా సాగ్గూడా లేదు- సెరువు పూడబెట్టడం కంటే అదియ్యడం మేలుగా,'' అన్నాడు తాతరెడ్డి.

“ఛీ నాయాళ్లు! అసలు పంచాయతీ తీరమానం అంటే ఎంటిక లెక్కలేదు ఎవుడికీ- పాడుబడ్డ సెరువు కోసం గలాట సేత్తన్నారు... అసలు తీరమానం పెకారం ఆడ రేపు గట్టు కొట్టేది కాయం... ఇళ్లేసేది కాయం. ఎవుడడ్డమొత్తాడో రండి,'' అన్నాడు రాయప్ప కోపంగా...

తాతరెడ్డి మారమాట్లాడలేదు, మౌనంగా ఉండి పోయాడు.

ఆ మాటలు వినడంతో నరిసిరెడ్డి రక్తం సలసల కాగినట్లయింది. ఎడంచేతిలో ఉన్న పొన్నుకర్రని కుడి చేతిలోకి మార్చుకున్నాడు.

"అదే నీ మాట కూడా అయితే ఇను సిన్నారెడ్డి- నీ కుటుంబం మీద గౌరవంతో ఊరి కట్టుబాటుకి లోబడి, నేనీడికొచ్చి మాట్టాడినాను. అంతేగాని సెరువుని కాపాడుకోలేగ్గాదు... రేపు సెరువుగట్టు... తెగెయ్యడం ఎవుడివల్లా కాదు- అట్ట జరిగిన్నాడు నే ఇప్పలోన్నే గాదు," అంటూ పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ గరటాలుతో సహా అక్కడి నుండి వెళ్లిపోయాడు.

చిన్నారెడ్డి ముఖం అవమానంతో ఎర్రబడింది... నెమ్మదిగా లేచి నిలబడ్డాడు- అతనేం జెప్తాడో విందా మన్నట్టుగా సద్దుమణిగారు జనం- గొంతు సవరించు కున్నాడు చిన్నారెడ్డి.

"ఊరు పుట్టినకాడి నుండీ పంచాయతీని 'సవాల్' జేసిన మడిసిలేదు- ఇది ఊరు, ఈడో పద్దతుంది, ఇచ్చక మయినా లేకపోయినా ఈడ పద్ధతి పెకారం పోవాలి సిందే... సెరువు పూడ్చడానికే పంచాయతీ నిచ్చయిం చింది. అంతేకాదు... అందుకడ్డుపడ్డోళ్లని ఊరి నుండి యెలెయ్యడం కూడా జరుగుద్ది..." అని జనం వైపు తిరిగి, "ఇదిగో అంజిరెడ్డి! మీ నాయనకేంజెప్పి ఆపు కుంటావో నీ ఇష్టం. ఊళ్లో ఉండాలనుకుంటే రేపు గట్టు కాడికి రావద్దని జెప్పు- అట్టానే నువ్వూ రాకు," అంటూ పెద్దరుగు దిగి ఊళ్లోకి నడిచాడు.

అంతవరకూ అల్లల్లాడించిన సూర్యుడు నెమ్మది పడి జారిపోతున్నాడు- ఊరిమీద సంజె చీకట్లు క్రమంగా ముసురుతున్నాయి.

పంచాయతీ నుండి సరాసరి ఇంటికెళ్లలేదు నరిసి రెడ్డి- గరటాలుతో సహా చెరువుగట్టు దగ్గరకెళ్లి కూర్చు న్నాడు.

"సెరువు నీళ్లు మిగల్నీయరు నారయ్యా!" అన్నాడు గరటాలు గట్టునున్న పిచ్చిమొక్కలు పీకుతూ...

మాట్లాడలేదు నరిసిరెడ్డి. దీర్ఘంగా చూస్తూ ఉండి పొయ్యాడు- ఒక్కక్షణం మౌనం తర్వాత మళ్లీ గరటాలే అన్నాడు.

"మా పల్లెలో కూడా సిన్నారెడ్డి మాట ఖరారంటు న్నారు."

తలతిప్పి 'ఏంటన్నట్టు' చూశాడు నరిసిరెడ్డి.

"ఆళ్లగేనానికి, మన గేనానికి మద్దె శానా తేడా మిగిలుంది నారయ్య- పల్లెల్లో ఎవ్వరికీ సెరువు దిగు ల్లేదు సిన్నారెడ్డి ఇప్పించే బూమి దిగులు తప్ప," దిగులుగా నిట్టూర్చాడు గరటాలు...

మాట్లాడలేదు నరిసిరెడ్డి- సాలోచనగా తల పంకించాడు... అతనేదో ఆలోచనలో ఉన్నాడని గ్రహించిన గరటాలు మరింకేమీ మాట్లాడలేదు.

సూర్యుడు పడమటాకాశంలోకి క్రమక్రమంగా క్రుంగిపోతున్నాడు- గాలి చల్లదనాన్ని కలుపుకుని హాయి గా వీస్తోంది...

ఏదో నిశ్చయానికొచ్చిన వాడిలా దిగ్గున లేచాడు నరిసిరెడ్డి- "పల్లెకాదురా, గరటా... ఊరు ఊరంతా కలిసినాసరే సెరువుని నిలుపుకోవాల్సిందే... నిలుపుతాను కూడా," అంటూ అక్కడి నుండి కదిలాడు.

"ఓ సిన్నమాట నారయ్యా," అంటూ పిల్చాడు గరటాలు.

'ఏమిట'న్నట్టు వెనక్కి తిరిగాడు నరిసిరెడ్డి.

"మనం వయసయిపోయినోళ్లం... పైగా ఆళ్లు మంది, నువ్వొక్కడివి ఊరికి ఎదురుపోడం సేమం కాదేమో..." అన్నాడు వారింపుగా.

"ఎక్కువమంది అన్నంత మాత్తరాన బూతుపదం కాదు- మంది సేసినపాటున సెడు మంచైపోదు. ఎట్టైన సెరువు నిలిపి తీరాల- అయినా నువ్వుండగా నే ఒంటి గాడ్ని ఎట్టవుతారా..." అని చిన్నగా నవ్వుతూ ఊళ్లోకి నడిచాడు నరిసిరెడ్డి.

నరిసిరెడ్డి ఇంటికెళ్లేసరికి గుమ్మంలోనే ఎదు రొచ్చాడు అంజిరెడ్డి. కొడుకును చూసి ఆగి, "ఏందిరా?" అన్నాడు నరిసిరెడ్డి.

అంజిరెడ్డి మారు పలకలేదు. ముభావంగా వెళ్లి పోయాడు.

ఇంట్లో కెళ్లగానే ఎదురొచ్చి కాళ్లకు నీళ్లిచ్చిన మునెమ్మతో అన్నాడు నరిసిరెడ్డి-

"ఏంది! నీ కొడుకు ముండమొహం యేసుకుని ఎడతన్నాడు?"

మాట్లాడలేదు మునెమ్మ- కాళ్లు తుడుచుకునేం దుకు గుడ్డ ఇచ్చింది. దాంతో కాళ్లు, చేతులు తుడుచు కుని, "ఏందంటే... మాట్లాడవ్?" అన్నాడు నర్సిరెడ్డి.

"ఏందో ఆణ్ణే అడక్కపొయ్యావా?" అంది మునెమ్మ గచ్చుమీద కంచం పెడుతూ.

"ఆడు పలికితేనా- ఏందంట ఇసయం?" అడిగేడు నర్సిరెడ్డి కంచం ముందు చతికిలపడుతూ.

మాట్లాడకుండా ఒడ్డించింది మునెమ్మ. "ఏదన్న కుండ పచ్చడెయ్యనా?" అంటూ అడిగింది.

"ఏందే పరాచకమా? ఆడేవన్నాడంటే సెప్పవ్?" కోపంగా అరిచాడు నరిసిరెడ్డి.

"బానే ఉంది సంబడం! ఆడింతవరకు ఎగిరిపో యిండు - ఇక నువ్వా? చత్తన్నామద్దిన నేను?" అంది మునెమ్మ విసుగ్గా.

"దేనికంట ఎగురుడు?" అడిగాడు నరిసిరెడ్డి అన్నం కలుపుతూ.

"ఇయ్యాల పంచాయతీలో సిన్నారెడ్డితో గొడవ పడ్డావంటగా... ఊళ్లో ఎవ్వరికీ లేని దురద నీకెందుకు అంటాడు నీ కొడుకు."

"అంటే... అంటే ఏందే..."

"అంటే ఏవుంది- సెరువు మంచిసెబ్బరలు ఊళ్లో ఎవరికి పట్టనప్పుడు ఈనకి మాత్తరం దేనికి? కూడుకా... గుడ్డకా అంటన్నాడు."

ముద్ద నోట్లో పెట్టుకోబోతూ ఆగాడు నరిసిరెడ్డి. "ఇప్పుడు తింటూ ఉన్న కూడు, కడతన్న గుడ్డ, ఆడు ఏరుబడి తీసుకున్న పన్నెండున్నర ఎకరాల సెక్క ఆ సెరువు బిచ్చమే అని సెప్పు" అని ముద్ద నోట్లో పెట్టు కున్నాడు.

"అయినా నీకు మాత్తరం పనిలేనితనం గాకపోతే వాడని సెరువు ఎట్టబోతే మటుకు మనకెందుకు సెప్పు," అంది మునెమ్మ.

ఆ మాటకి చివ్వున తలెత్తి మునెమ్మ వైపు చూశాడు నరిసిరెడ్డి - "అసలేంది మాట్లాడతారే మీరు? మీకు మనసెలా ఒప్పుద్ది సెరువు పూడ్సమంటానికి? పుట్టిన కాడినుండి సెరువున పడి పెరిగాం... దానిమీద బతికామే మనం... ఇశ్వాసం లేదే మీకు?"

"అట్ట కాదయ్యా పంచాయతీ తీరమానం అంటగదా..."

ఆమె మాటని పూర్తికానివ్వలేదు నరిసిరెడ్డి - "ఏందే తీరమానం? - ఊళ్లో జనం మీదయితే ఈళ్లు జెయ్యొచ్చు - కానీ సెరువు మీన - అందులో బతికే సేప పిల్లల మీన, సెరువుని ఇడిది సేసుకునే పక్షుల మీన ఈళ్లెవలె తీరమానాలు జెయ్యను" అన్నాడు కోపంగా.

"అది సరేనయ్యా... మరసలు వాడకానికి పనికిరాదుగా - ఉపయోగమేంది అదుండి?" అంది మునెమ్మ.

"సెరువు వల్ల ఉపయోగం లేదా... ఇయ్యాల ఊళ్ల యాడ తవ్వినా నాలుగు బారలకి తియ్యటి నీరు పడతది - ఊరి పక్కన సెరువుండబట్టే ఆ 'జల' పడుతోంది - అసలు ఈ ఊళ్లో రైతుకి సెరువుమీద పానెం లేదే... రైతన్నోడికి బూమి తల్లైతే - నీరు దేవుడే... ఆ ఇవరం ఒక్కడికి తెలుసా? - సెరువుని ఎండబెట్టడం అసలెంత గోర పాపం? ఇండ్ల జాగాలు పంచడమంటే... అది పల్లోళ్ల మీద పేమా? పంచాయతీ కురిసి మీన పేమ - ఇండ్ల జాగాలకి మరో సోటు కనిపించలేదంటే మతిమాలిన నాయాళ్లకి... కూకున్న కొమ్మని నరుక్కోడం కాదంటే ఈ పని?" ఆవేశంగా మాట్టాడడంతో కొరబో యింది నరిసిరెడ్డికి.

కంగారుగా మంచినీళ్లందించింది మునెమ్మ- అతని మాడు మీద నెమ్మదిగా కొడుతూ అంది...

"సర్లే నువ్వారక ఐరాన పడకుండా కూడు దిను." నీళ్లు తాగి కాస్త నెమ్మదిపడి మౌనంగా అన్నం తిండం ప్రారంభించాడు నరిసిరెడ్డి.

రెండు క్షణాల మౌనం తర్వాత నెమ్మదిగా అంది మునెమ్మ- "రేపు సెరువు గట్టు కాడికెడితే... ఊళ్లోంచి యెలేత్తానన్నాడంట సిన్నారెడ్డి- ఇదే సెప్పాడు నీ కొడుకు- రేపు ఆడు సెరువు కాడికి రాడంట, నిన్ను ఒద్దని సెప్పాడు."

తింటున్న అన్నాన్ని కంచంలోకి ఇసిరికొట్టి- "ఛీ నీయమ్మ నీతిలేనోళ్లు- నన్ను ఆళ్లు యెలేసేదేంటే... నేనే ఊరు మొత్తాన్ని యెలేస్తున్నా," అంటూ చెయ్యి కడు క్కుని కంచం ముందునుంచి లేచిపొయ్యాడు నరిసిరెడ్డి.

*

సూర్యుడు తూర్పున ఎర్రగా ఉదయించాడు.

రోజూ కన్నా త్వరగా నిద్రలేచింది ఊరు- ఆ రోజే మవుతుందో చూద్దామన్న ఉత్సుకతతో-

"ఇదిగో నే సెరువు కాడికి వెళుతున్నాను," దొడ్లో ఉన్న మునెమ్మకి అరిచి చెప్పాడు నరిసిరెడ్డి. అతనికి ఒక చేతిలో పొన్నుకర్ర, మరొక చేతిలో కాగితాల కట్ట ఉన్నాయి. అతని వాలకాన్ని పరీక్షగా చూసి అడిగింది మునెమ్మ- "ఏందది సేతిలో?"

ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు నర్సిరెడ్డి- "నీ కొడు కొస్తే భద్రంగా గాజులేసుకుని కూకోమని జెప్పు," అన్నాడు వెళ్లడానికి ఉద్యుక్తుడవుతూ.

"ఏమయ్యోవ్!" పిలిచింది మునెమ్మ.

'ఏంటన్నట్లు,' చూశాడు నర్సిరెడ్డి.

"ఆడ అనవసరంగా గొడవపడమాక- నీకు మాట సులువు తక్కువ. నాకెందుకో బయమౌతా ఉంది," అంది.

ఆ మాటకి చిన్నగా నవ్వి ఆమెకి దగ్గరగా ఒచ్చాడు నరిసిరెడ్డి.

"నువ్వయినా, నేనయినా బయపడాల్సింది, బాధ పడాల్సింది సెరువుకేమైనా అవుతుందేమోననే... మనకేం అవుతుందని గాదు"... అని బయటకు నడిచాడు.

నరిసిరెడ్డి చెరువు దగ్గరికెళ్లేసరికే అక్కడ పలుగు పారలతో జనం పోగై ఉన్నారు. చిన్నారెడ్డి కోసం చూశాడు నరిసిరెడ్డి. అతను లేడు. అంతా పల్లెజనమే ఉండటం గమనించాడు నరిసిరెడ్డి. అక్కడి అజమాయిషీ అంతా రాయప్పే చూస్తున్నాడు- రాయప్ప మినహాయించి- మరే పంచాయితీ పెద్ద అక్కడ లేరు.

జనం చేతిలో పలుగు, పారా చూడగానే నరిసిరెడ్డి నడకలో వేగం పెరిగింది- సరాసరి అంతకు మునుపు రోజూ కోత పెట్టిన పల్లపు వైపు గట్టు దగ్గరికెళ్లి నిలబడి-

"అందరూ ఒక్కసారి నా మాట వినండి," అంటూ గట్టిగా అన్నాడు.

అతని రాకతో మొదలైన కలకలం అతని మాటతో సద్దుమణిగింది.

"ఈడ మీరు కట్ట తెగ్గొడుతోంది- సెరువు పూడ్చాలనుకుంటోంది- ఆ జాగాల కోసమేగా- అందుకు మీరు ఈ పని సెయ్యక్కర్లేదు."

ఆ మాట వినడంతోనే రాయప్ప భ్రుకుటి ముడి పడింది.

"అవునురా... తరాలకాడి నుండి ఊర్ని కాసుకుంటూ ఉంది సెరువు. దాన్నిప్పుడు పూడ్చాలనుకోవడం యెర్రిపని- మీగ్గావల్సింది ఇళ్లేసుకుంటానికి బూమేగా? ఇదిగో సెరువుకి ఉత్తరాన ఆనుకుని ఉందే నా పొలం రెండున్నర ఎకరా- ఇది మీకు రాసేత్తా. పట్టాలు పుట్టించుకుని ఇళ్లేసుకోండి."

ఒక్కక్షణం అతని వంక అపనమ్మకంగా చూశారు పల్లె జనమంతా.

"ఏందిరా ఆ సూపు? నమ్మకం లేదేంది?" చేతిలో ఉన్న కాగితాలని విప్పి చూపించాడు నర్సిరెడ్డి, "ఊళ్లో కెళ్లి ఎవురు కాడయినా సూపించుకోండి".

జనం మధ్యలో ఉన్న గరటాలు ముఖం వికసించింది. జనం మధ్యలోంచి బయటకొచ్చాడు.

"అవునురా... మనకు కావలసింది ఏంది? బూమేగా- అదెవుడిస్తే ఏంది?... పుట్టినకాడి నుంచి మన్ని సాకిన సెరువు- దాన్ని ఎండగట్టిన పాపం ఏటికిరా మనకి?"

అవుననిపించింది చాలామందికి. చేతిలో ఉన్న పలుగు, పార నెమ్మదిగా జారవిడిచారు. పల్లె సందిగ్ధాన్ని గమనించాడు రాయప్ప- "ఎహే... ఎవుర్రా... మీరు- ఈన ఇత్తనంటం మీరు ఇంటం- సేనేవన్నా నరిసిరెడ్డి సొంతవా? కొడుకు లేడా- రేపు ఆడూరుకుంటాడా? ఇప్పుడీయన ఇత్తానంటే మటుకు," అన్నాడు.

"ఇది నా సొంతభాగం- నా కొడుకు ఏరుబడి పొయ్యాడు. ఆడికి, ఈ సెక్కకి సంబంధంలేదు," అన్నాడు నరిసిరెడ్డి.

"నీ కొడుకు కాకపోతే నీ పెళ్లాం. రేపు మునెమ్మ వచ్చి, నా ఇచ్చకం లేకుండగా సేను మీరెట్ట తీసుకున్నారు అంటే. ఈళ్లేసుకున్న గుడిసెలు పీక్కుని దేశా లెంబడి పోవాల్నా?"

ఆ మాట నిజమే అనిపించడంతో కిందేసిన పలుగూపారా చేతిలోకి తీసుకున్నారు జనం.

"రాయప్ప- ఈడ పంచాయతీ రాజకీయం చెయ్యమాక -నీకు తెలుసు ఈ కాగితాలు సెల్లతాయని- జనాన్ని ఊరక రెచ్చగొట్టమాకు," తీవ్రంగా అన్నాడు నరిసిరెడ్డి.

"ఎవరు? నువ్వు- నువ్వు జేత్తన్నవ్ రాజకీయం. పల్లెజనం సెరువులో ఇళ్లేసుకుంటే- ఊరి పక్కకి ఒచ్చేత్తారని అక్కసు నీకు," అన్నాడు రాయప్ప.

ఆ మాట పూర్తికాకుండానే దూసుకొచ్చాడు గరటాలు- "రాయప్పా ఇంకోసారి నారయ్య గురించి మాట జారావా... పెద్ద కాపువని కూడా  సూడను- పల్లోళ్లు పక్కనుండగూడదనుకునే మడిసి సొంత బూమెందుకు పంపకం జేత్తాడు?" అన్నాడు ఆవేశంగా.

అంతమందిలో గరటాలు తనపైకి ఉరికి తన్ని నిలెయ్యడంతో తల కొట్టేసినట్టయింది రాయప్పకి- "ఏందిరా నీయవ్వ... పైకొత్తున్నావ్? తొత్తునాయాల," అంటూ గరటాలుని విసురుగా తోసి- "కొట్టండిరా ఎవడడ్డ మొస్తాడో చూస్తా"నంటూ అరిచాడు రాయప్ప.

అంతే!

అంతవరకు ఊగిసలాడుతున్న జనం- ఒక్కసారిగా, చెలియలి కట్టని దాటిన సముద్రపు కెరటాల్లా గట్టుమీద కురికారు. ఒక్కసారిగా జరిగిన ఈ సంఘటనతో నరిసిరెడ్డి నిశ్చేష్టుడయ్యాడు. అతను తెప్పరిల్లేసరికి గట్టు తెగడం ఆరంభమయ్యింది.

"కొట్టమాకండిరా! ఆపండిరొరేయ్!"అని అరుస్తూ గట్టువైపు పరిగెత్తాడు నరిసిరెడ్డి. కళ్లల్లోకి చూసి చిన్నగా నవ్వాడు రాయప్ప- "గట్టెట్టా తెగ్గొడతారో సూత్తానన్నావుగా, సూడు," అన్నాడు ఎకసెక్కంగా.

అయితే అతని ఎక్కసాన్ని పట్టించుకునే పరిస్థితి లేదు నరిసిరెడ్డికి. అతని గుండెంతా చెరువు మీదే

ఉంది. అయిపోవచ్చింది. ఈ గట్టుకాస్త తెగితే సెరువిక సెరువు కాదు - బీడే - చిన్నతనాన గట్టుమీద నిలబడితే సూరీడు పుట్టేవరకూ కనిపించిన సెరువిక కనిపించదు. ఇంకెన్నటికీ కనిపించదు. అట్టవడానికి ఈల్లేదు, సెరువు గట్టు తన పానం ఉండగా తెగ్గొడదు...

ఒక్కసారి పళ్లు బిగపట్టి శరీరంలో శక్తినంతా కూడదీసుకుని విడిపించుకున్నాడు నరిసిరెడ్డి - డెబ్బై ఏళ్ల నరిసిరెడ్డి నుంచి ఏమాత్రం ప్రతిఘటనా ఊహించని రాయప్ప తన మనుషులతో సహా పక్కకి తూలాడు.

గట్టుమీద పడుతున్న ప్రతి దెబ్బ తన గుండె మీద పడుతున్నట్టుగా- "ఆపంద్రా," అని రోదిస్తూ జనం మధ్యలోంచి జొరబడి చెరువుగట్టు కడ్డంగా పడ్డాడు. ఒక్కక్షణంలో జరగిన ఈ సంఘటనని జనం గమనించే లోపల గట్టుని తాకాల్సిన దెబ్బ సరిగ్గా నరిసిరెడ్డి తలని తాకింది. జివ్వున రక్తం ఎగజిమ్మింది. అదే క్షణాన గట్టు తెగింది.

తమ అస్తిత్వాన్ని నిలపడం కోసం తన సర్వాన్ని పణంగా పెట్టిన అతన్ని అభిషేకించటానికేన్నట్టుగా ఉవ్వెత్తున అతని మీద కురికినాయి నీళ్లు- ఆ ప్రవాహ వేగానికి నరిసిరెడ్డి పల్లంలోకి జారిపొయ్యాడు. అది చూసిన గరటాలు, "నారయ్యా," అంటూ పల్లంలోకి పరిగెత్తాడు... గట్టు తెగటం మూలాన చెరువు నీరు ఉద్ధృతంగా పల్లంలోకి పారుతోంది. కొంతదూరం నీటితో పాటు కొట్టుకొచ్చి పిచ్చిమొక్కల మాటున తట్టుకుని ఆగిపోయిన నరిసిరెడ్డిని పొదివి పట్టుకుని అతని తల తన ఒళ్లోకి తీసుకున్నాడు గరటాలు.

"నారయ్యా... నారయ్యా..." దుఃఖంతో కంఠం పెగలడం లేదు గరటాలుకి.

అతి ప్రయత్నం మీద నెమ్మదిగా కళ్లు తెరిచాడు నరిసిరెడ్డి- అతని నుదురు నుండి స్రవిస్తున్న రక్తం చెంపల మీదుగా ధారాపాతంగా జారి చెరువు నీటిలో కలిసి- ఎర్రగా ప్రతిఫలిస్తోంది.

"అయిపోయింది నారయ్యా- మన సెరువింక లేదు," అన్నాడు గరటాలు.

నరిసిరెడ్డి కళ్లు తెగిన చెరువు గట్టు వైపుకు మళ్లాయి. అప్పటికే చెరువులో నీరంతా పూర్తిగా జారిపోయింది.

నీటిలోంచి బయటపడ్డ చేపపిల్లలు ఊపిరాడక ఒడ్డునపడి కొట్టుకుంటున్నాయి జరిగిన ఘోరానికి మూగ సాక్ష్యాలుగా.

ఈ దృశ్యం చూసిన నరిసిరెడ్డి కళ్లు నిశ్చలంగా నిలబడిపొయ్యాయి.

చెరువు మీద ప్రాణం పెట్టుకున్న నరిసిరెడ్డి ప్రాణం చెరువుతోపాటే పోయింది- గాలి సంతాపంగా ఒక్కక్షణం ఆగిపోయిందక్కడ.

నరిసిరెడ్డి శరీరస్పర్శలో తేడా ఒక్కక్షణం అర్థం కాలేదు గరటాలుకి- అర్థమయిన మరుక్షణం- నరిసిరెడ్డి శరీరాన్ని చుట్టుకుపొయ్యాడు దు:ఖంతో...

గరటాలు గుండె చెరువయ్యింది- నరిసిరెడ్డికి చెరువే గుండెయినట్టుగా. గరటాలు రోదిస్తున్నాడు! పెద్దగా దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నాడు.

ఆ బురదలో పడి పొర్లుతూ- గుండెలవిసి పోయేలా రోదిస్తున్నాడు-

ఒడ్డునపడ్డ చేపపిల్లలు ఊపిరాడక క్రమక్రమంగా అచేతనమవుతున్నాయ్.

అక్కడ...

ఆకాశంలో రాబందుల గుంపులు తిరగడం ఆరంభించాయ్.

ప్రకృతిని చెరిచి మనిషి చేసుకోబోయే ఆత్మ విధ్వంసానికి- సాక్షీభూతాల్లా...

*ఆంధ్రప్రభ వారపత్రిక, 14-20 ఏప్రిల్ 1993*